క్లుప్తంగా

పంట నష్టం అంచనా



తాడేపల్లిరూరల్: అకాల వర్షాలకు నష్టపోయిన పంట వివరాల నమోదును గురువారం నుంచి తాడేపల్లి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. తాడేపల్లి ఏఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో 2023–23 రబీ సీజన్‌లో మొక్కజొన్న పంట 1480 ఎకరాల్లోను, జొన్న పంటను 285 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. అకాల వర్షాల వలన ఇప్పటి వరకు 100.8 మిల్లీమీటర్లు వర్షం పడింది. ఈ అకాల వర్షాల వల్ల మొక్కజొన్న పంటకు ఎటువంటి నష్టం జరగలేదు. పంట కోత కోయని 10 ఎకరాల్లో జొన్న పంటకు నష్టం జరిగింది. కల్లాల్లో ఆరబెట్టిన 5 ఎకరాల్లో జొన్న పంట నష్ట జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, నష్టపోయిన పంట వివరాలను జిల్లా అధికారులకు తెలియజేయనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

తురకా లేని లోటు తీరనిది

బోరుపాలెం(తాడికొండ): ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తురకా శ్రీనివాసరావు మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పార్టీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామంలో గురువారం జరిగిన వర్ధంతి సభకు సురేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తురకా శ్రీను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీను కుటుంబసభ్యులను ఓదార్చిన ఆయన రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటానని, పిల్లల చదువులకు కావాల్సిన చేయూత అందిస్తానన్నారు. ఆయన వెంట పలువురు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

అదనపు సీఐగా హుస్సేన్ బాధ్యతల స్వీకారం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ అదనపు సీఐగా మొహమ్మద్ అల్తాఫ్ హుస్సేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాడేపల్లిలో సీఐగా పనిచేసిన సాంబశివరావు సీఐడీకి బదిలీ కావడంతో మేడికొండూరు సీఐగా పనిచేసిన హుస్సేన్ బదిలీపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.

ఇస్కాన్ టెంపుల్‌లో నరసింహ ఆవిర్భావ దినోత్సవం



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఉన్న ఇస్కాన్ టెంపుల్‌లో గురువారం నరసింహ ఆవిర్భావ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. నరసింహస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆయన చరిత్రను ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు చక్రవర్తి దాస్ వివరించారు. తల్లిదండ్రులు పిల్లల్లో భక్తి భావాన్ని పెంపొందించాలని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మహాప్రసాదాన్ని స్వీకరించారు.

చలివేంద్రం ప్రారంభం

తాడికొండ: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గురువారం తుళ్లూరులో సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కూలింగ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన కూడళ్ల వద్ద మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బోరుపాలెం గ్రామ సచివాలయాన్ని కత్తెర సురేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

రైతుల ఇబ్బందులు తొలగించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- కాజ రైతులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



కాజ రైతుకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: నియోజకవర్గంలో సంవత్సరాల తరబడి రెవెన్యూ రికార్డులలో సర్వే నంబర్లు తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేసి రైతుల ఇబ్బందులు తొలగించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నగర పరిధిలోని రైతులకు సరిచేసిన రెవెన్యూ రికార్డుల ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే ఆర్కే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి పంపిణీ చేశారు. దశాబ్దాలుగా అప్పట్లో రెవెన్యూ అధికారులు నమోదు చేసిన రికార్డులలో సర్వే నెంబర్లు తప్పుల పడడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ రికార్డులలో సర్వే నంబర్లు తప్పుగా నమోదు కావడం వలన ఒక్క కాజ పరిధిలోనే సుమారు 70 మందికిపైగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రీ సర్వే నిర్వహించి ఇప్పటివరకు 35 మంది రైతులకు సరిచేసిన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశామన్నారు. కాజ లాగానే నియోజకవర్గంలోని అనేక గ్రామాలలో సర్వే నంబర్లు రికార్డులలో తప్పుగా నమోదు కావడంతో అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక్కో గ్రామంలో రెవెన్యూ అధికారులతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి రికార్డుల్లోని సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, వీఆర్‌వోలు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు ఎమ్మెల్యే ఆర్కేను కలిసి నగరంలో ఎస్ఈబీ స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

ఈ నెలాఖరునాటికి చెత్తను పూర్తిగా తరలించాలి

నగర పరిధిలోని నిడమర్రు రైల్వే గేటు వద్ద కల డంపింగ్ యార్డులోని చెత్తను ఈ నెలాఖరునాటికి పూర్తిగా తరలించాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. డంపింగ్ యార్డులోని చెత్త తరలింపు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే చెత్త తరలింపు పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. చెత్త తరలించేందుకు మిషనరీ, వాహనాలను పెంచి 24 గంటలు పనిచేసి చెత్త తరలింపును ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డంపింగ్ యార్డు స్థలంలో గ్రావెల్‌తో మెరకతోలి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మగ్గాల షెడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

నగర పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీ వద్ద నిర్మిస్తున్న చేనేత మగ్గాల షెడ్లను తుది దశకు చేరుకున్న నేపథ్యంలో వెంటనే మిగిలిన పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మగ్గాల షెడ్లలో మగ్గాలను కేటాయించేందుకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలన్నారు. పేద చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నగర కమిషనర్ యు శారదాదేవి, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీఏ వనజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేర్చడమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



మోతడక గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కత్తెర సురేష్‌కుమార్

మోతడక(తాడికొండ): సంక్షేమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. గురువారం తాడికొండ మండలం మోతడక గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి పేదవాడికి సంక్షేమం చేరువ చేసేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేసి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల మన్ననలు పొందిందన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో రోల్‌మోడల్‌గా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు రాష్ట్రంలో తప్పుడు ప్రచారాలకు దిగుతుండటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, గ్రామ అధ్యక్షులు నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, బోయపాటి సాంబశివరావు, వెంకటయ్య మాస్టారు, వాడకొప్పుల రాజు, సంసోన్, మాధవ్ పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



చిరువ్యాపారులకు తోపుడుబండ్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ ప్రాతూరులో చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహకారంతో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుడు బండ్లను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ రెడ్డిబత్తుల సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు సంకురు మరియబాబు, పాతూరు కోటేసు, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్యే సాయం

మంగళగిరి: పెదవడ్లపూడిలో అనారోగ్యంతో మృతిచెందిన చింతకుంట జోసెఫ్ కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే సాయం ప్రకటించారు. నగదును స్థానిక పార్టీ నాయకులు జోసెఫ్ కుటుంబసభ్యులకు గురువారం అందజేయగా కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ



పాలకవర్గ సభ్యులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పాలకవర్గం రైతుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసి సొసైటీతోపాటు ఎమ్మెల్యే ఆర్కేకు, వైఎస్సార్ సీపీకి మంచి పేరు తీసుకురావాలని పార్టీ నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణ పేర్కొన్నారు. నగర పరిధిలోని నిడమర్రు రోడ్డులో గల పీఏసీఎస్ కార్యాలయంలో కురగల్లు పీఏసీఎస్ నూతన పాలకవర్గ సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ నీరుకొండ గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు, డైరెక్టర్లుగా కురగల్లుకు చెందిన కట్టెపోగు సోమయ్య, నీరుకొండకు చెందిన చలమలపల్లి వెంకటేశ్వరరావులతో సొసైటీ కార్యదర్శి రాయల్ రమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాజనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే బీసీ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మంగళగిరి పీఏసీఎస్ చైర్మన్ ఆర్ల బ్రహ్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, సొసైటీ సిబ్బంది నూతన పాలకవర్గాన్ని సత్కరించారు.

ఎన్‌సీఆర్‌సీ జిల్లా చైర్‌పర్సన్‌గా వీణ

తాడికొండ: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ గుంటూరు జిల్లా చైర్‌పర్సన్‌గా తాడికొండ మండలం పాములపాడు గ్రామానికి చెందిన బందారు వీణను నియమించారు. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం, విద్యలో ఉన్నతంగా రాణిస్తున్నందుకు ఆమెకు ఈ బాధ్యతలు అప్పగించారు. విశాఖలో ఇటీవల జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా వినియోగదారుల హక్కుల కమిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంవీఎల్ నాగేశ్వరరావు వీణకు నియామక ఉత్తర్వులు అందజేశారు. వీణ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఎన్‌సీఆర్‌సీ జాతీయ చైర్మన్ నాగేశ్వరరావు, రాష్ట్ర చైర్మన్ బల్ల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి కల్వగుంట భరత్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ కోటేశ్వరబాబు, బండారు సుచరితలకు కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారుల హక్కుల కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి పెనుమాక రోడ్డులో అర్ధరాత్రి సమయంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి వింతగా ప్రవర్తిస్తూ ఇళ్ల ముందు పూజలు చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎవరో గుర్తుతెలియని వ్యక్తి తెల్లపంచె, తెల్ల చొక్కా ధరించి ఓం నమశ్శివాయ అంటూ ఇళ్ల ముందుకు వచ్చి పెద్దపెద్దగా కేకలు వేయడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. యువకులు అతడ్ని పట్టుకునేందుకు ప్రయత్నించగా వారిమీద పసుపు, కుంకుమ చల్లడంతోవారు భయపడ్డారు. ఎట్టకేలకు అతడిని పట్టుకుని కొట్టేందుకు ప్రయత్నించగా అర్ధరాత్రి బీట్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వారి ప్రయత్నాన్ని అడ్డుకుని ఆ వ్యక్తిని ప్రశ్నించాడు. తన పేరు రాజు అని, తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, ఇద్దరు మగపిల్లలు చనిపోయారని, పొంతన లేని సమాధానం చెప్పాడు.

11 నుంచి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చికిత్సా శిబిరం

తాడేపల్లిరూరల్: రోటర్లీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆక్యుప్రెజర్, మాగ్నటిక్ చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్ వంశీ టాలెంట్ స్కూల్‌లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటలకు నిర్వహించనున్నామని, ఈ శిబిరంలో అధిక బరువు, రక్తపోటు, మోకాళ్ల నొప్పులు, బ్యాక్ పెయిన్, తలనొప్పి, నిద్రలేమి, ఆస్తమా, చికెన్ గున్యా తదితర సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఆరు రోజులకు స్పాట్ రిజిస్ట్రేషన్ కేవలం రూ.200 మాత్రమేనని, రిజిస్ట్రేషన్ కోసం రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి సెక్రటరీ కాట్రగడ్డ శివన్నారాయణ, ట్రెజరర్ రామకృష్ణశెట్టి 9948074356, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కొల్లి వెంకట చంద్రశేఖరరెడ్డి, 9966227141, జొన్నా రాజేష్ 9581837979లను సంప్రదించాలని కోరారు. శిబిరంలో మహిళా థెరపిస్ట్ సౌకర్యం అందుబాటులో ఉందని, ట్రీట్‌మెంట్‌ను డాక్టర్ సత్యనారాయణచౌదరి జోథ్‌పూర్ (రాజ్), థెరపిస్ట్ జెఆర్.జత్.జాయి చౌదరిలు సేవలు అందించనున్నారని, ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

తడిసిన పసుపును మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు



పసుపు పంట కల్లాలకు పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: అకాల వర్షాలకు తడిసిన పసుపును ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు అన్నారు. గురువారం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రాతూరు గ్రామంలో రైతు సంఘంనాయకులతో కలసి తడిసిన పసుపు కల్లాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా పసుపు క్వింటా రూ.6850లకు కొనుగోలు చేయడం లేదని అన్నారు. ప్రస్తుతం అకాల వర్షాలతో పసుపు పండించిన రైతులు కల్లాల్లో పసుపు తడిసి అనేక ఇబ్బందులు పడుతున్నారని, పసుపు తడవడం వల్ల తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పసుపు రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరకు పసుపును కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఏపీ రైతు సంఘం మండలనాయకులు డోకిపర్తి రాజేంద్రబాబు, సూరిశెట్టి వెంకటేశ్వరరావు, ఆదం, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తాడేపల్లిరూరల్: ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతు, కౌలు రైతులను ఆదుకోవాలని దుగ్గిరాల మండల ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కోత కోసిన జొన్న, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కొన్నిచోట్ల మొలకలు కూడా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన పంటను తక్కువ ధరకు రైతులు అమ్ముకోవాల్సి వస్తోందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే స్పందించి పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులకు, కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 9వ తేదీన రైతు, కౌలు రైతులను సమీకరించి మండల కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో రైతుసంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, కౌలు రైతం సంఘం మండల కార్యదర్శి ఎం.నాగ మల్లేశ్వరరావు, రైతు సంఘం నాయకులు వి. సాంబశివరావు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు బి.అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రహదారికి మరమ్మతులు

అనంతవరం(తాడికొండ): రోడ్డు సౌకర్యం సరిగా లేదంటూ ఆర్టీసీ సర్వీసులు నిలిపివేయడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ చొరవతో బస్సును పునరుద్ధరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు అధ్వానంగా ఉందని మూడేళ్లుగా మంగళగిరి–అమరావతి బస్సులు సర్వీసులను నిలిపివేశారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు సురేష్‌కుమార్ సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించి ఆర్టీసీ అధికారులతో సంప్రదించడంతో బస్సు సౌకర్యం పునరుద్ధరించారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తమ అభ్యర్థన మేరకు బస్సు సర్వీసును పునరుద్ధరించడం హర్షణీయమని, ఆర్టీసీ సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డామని, చొరవ తీసుకొని పరిష్కారానికి కృషి చేసిన కత్తెర సురేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపార్టీ అధ్యక్షుడు పోలు రమేష్, స్థానిక నాయకులు బండ్ల శ్రీకాంత్, మేకల రవీంద్ర, మేకల వెంకటేశ్వరరావు, ఆరేపల్లి జోజి పాల్గొన్నారు.

అల్లుడిపై దాడి

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకానిలో అల్లుడిపై అత్తా, మామ, బావమరిది కలసి దాడి చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చినకాకానికి చెందిన సత్తెనపల్లి రాజశేఖర్‌కు అదే ప్రాంతానికి చెందిన గండికోట వెంకటశివరావు, దుర్గారాణి దంపతుల కుమార్తెతో కొన్నేళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా ఇరు కుటుంబాల మధ్య కలహాలు రేగాయి. ఈ నేపథ్యంలో గురువారం రాజశేఖర్‌తోపాటు ఆయన తల్లిదండ్రులపై వెంకట శివరావు–దుర్గారాణి, ఆమె కుమారులు శ్రీహరి,రామకృష్ణతోపాటు వారి దగ్గర బంధువు గుర్రం ఏసుబాబు దాడికి పాల్పడ్డారు. రాజశేఖర్‌తోపాటు ఆయన తల్లిదండ్రులకు గాయాలయ్యాయి.